క్లుప్తంగా

స్ట్రాంగ్ రూంల పరిశీలన



స్ట్రాంగ్ రూం పరిశీలిస్తున్న ఏసీపీ

చెన్నూర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూంలను సోమవారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. భద్రతా, సౌకర్యాలు ఏర్పాట్ల గురించి చర్చించారు. ఆయన వెంట చెన్నూర్, చెన్నూర్‌రూరల్ సీఐలు రవీందర్, సుధాకర్ ఉన్నారు.

నిషేధాజ్ఞలు పొడిగింపు

మంచిర్యాలక్రైం: జిల్లాలో అమలులో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 1 నుంచి మార్చి 1 వరకు పొడిగించినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ పౌరులు ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అనుమతులు లేకుండా డీజే, డ్రోన్ కెమెరాలు వినియోగించడాన్ని నిషేధించినట్లు తెలిపారు.

'కేసీఆర్‌ను రైతులు నమ్మరు'

చెన్నూర్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రైతులు ఆగమయ్యారని, నేడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 'రైతుబాట' పేరుతో కపట ప్రేమ నటిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు జాడి రాజేందర్ ఆరోపించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో పంటలు నీట మునిగి రైతులు నష్టపోతే పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత రైతులపై ప్రేమ నటిస్తున్నారని ఆరోపించారు. నేడు మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రైతు దీక్షల పేరుతో మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో యూత్ నాయకులు సంపత్, బీరేశ్‌లు పాల్గొన్నారు.

కమిషన్ సభ్యున్ని కలిసిన అధికారులు

శ్రీరాంపూర్: నేషనల్ కమిషన్ షెడ్యూల్ కాస్ట్ మెంబర్‌గా నియమితులైన రాంచందర్‌ను సోమవారం సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా ఎస్సీ లైజన్ అధికారి కిరణ్‌కుమార్, పీఎం రాజేశ్వర్ కలిశారు. సోమవారం వారు రామగుండంలోని గెస్టుహౌస్‌లో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. దీనిపై కంపెనీ స్థాయిలో రివ్యూ సమావేశం ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

'ఐకమత్యంతో ఎంపీగా గెలిపించుకుందాం'

జన్నారం: ఐకమత్యంగా అందరం కష్టపడి బీజేపీ ఎంపీ అభ్యర్థి గెడం నగేశ్‌ను గెలిపించుకుందామని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన గుండవరపు మధుసూదన్‌రావును నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. పథకాలను ఇంటింటికీ వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శంకరయ్య, బీజేవైఎం అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట బెటాలియన్ ఎదురుగా గల గోవింద క్షేత్రంలో గోవిందరాజస్వామి సహిత భూవరాహస్వామి ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనముల పర్యవేక్షణలో నాలుగో తేదీ గురువారం గోవిందరాజస్వామి, భూవరాహస్వామి దేవతా విగ్రహాల ప్రాణప్రతిష్ఠకు గ్రామ, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆలయ కమిటీ కోరింది.

రక్తదానం



రక్తదానం చేస్తున్న మహిళలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకులో సోమవారం స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధి వి.మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంకు సూపర్‌వైజర్ కే.మాధవి, మల్లీశ్వరి, సంధ్య, శైలజ, మౌనిక, వేణు, రక్తదాతలు సంధ్యారెడ్డి, రజనీరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



శోభాయాత్రలో ఆకర్షణగా శివుడు, మార్కండేయుడి వేషధారణలో భక్తులు



ట్రాక్టర్‌పై పట్టువస్త్రాలు నేస్తూ రాపల్లి ఆలయం వరకు సాగిన శోభాయాత్ర



ఆలయ అర్చకుడికి మగ్గంపై నేసిన పట్టువస్త్రాలు అందజేస్తున్న భక్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి పునరావాస కాలనీలో నూతనంగా నిర్మించిన మార్కండేయ ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం ముగిశాయి. వేద పండితులు గంగారపు శ్రావణ్‌కుమార్‌శర్మ, గ్రామ పురోహితులు సాంబయ్యశర్మ చేతుల మీదుగా ఆలయ ధ్వజస్తంభ, నవగ్రహ, భక్తమార్కండేయ సహిత శివపంచాయతన యంత్ర విగ్రహ ప్రాణప్రతిష్ఠను వేదమంత్రోచ్చారణల మధ్య గావించి హోమ పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలికారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ప్రతిష్ఠ అనంతరం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేపట్టగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

వినూత్నంగా మార్కండేయుడికి వస్త్రాలు..

నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పద్మశాలీ కుల బాంధవులు ట్రాక్టర్లో చేనేత మగ్గం ఏర్పాటు చేసి హనుమాన్ ఆలయం నుంచి గ్రామవీధుల గుండా ప్రత్యేకంగా శోభాయాత్ర చేపట్టారు. శివుడు, మార్కండేయుల వేషాధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఘనంగా మల్లన్న పట్నాలు



మల్లన్నను కొలుస్తున్న ఒగ్గు పూజారులు



మల్లన్న దేవున్ని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

దండేపల్లి:మండల కేంద్రంలోని శ్రీమాల్గాం మల్లన్న ఆలయంలో పట్నాలు, భోనాల వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆలయ ఆవరణలో ఒగ్గు పూజారులు పసుపు, పచ్చ పిండితో పట్టు పరిచి పట్నం వేశారు. మల్లన్న స్వామి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. యాదవ కులస్తులు, స్థానిక ప్రజలు ఆలయ ఆవరణలో భోనాలు వండి మల్లన్న దేవుడికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. వారి వెంట ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు, యాదవ సంఘ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కబ్జాకుగురైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లి: కబ్జాకు గురైన ఇందిరమ్మ ఇళ్ల స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకుని అక్రమార్కుడిపై చర్యలు తీసుకోవాలని తాండూర్ మండల కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి భాస్కర్‌గౌడ్, ఆనంద్, హరికృష్ణ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 2007సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం బారేపల్లిలో 41/ఆ సర్వే నంబర్‌లోని 1.17ఎకరాలు, 45/ఆ సర్వే నంబర్‌లోని 1.25ఎకరాల భూమిని పట్టేదారులైన సుబ్బ దత్తుమూర్తి, దోకే లక్ష్మిల నుంచి కొనుగోలు చేసిందని తెలిపారు. 60మంది పేదల కోసం కొనుగోలు చేసిన ఆ భూమిని తన రాజకీయ పలుకుబడితో దత్తుమూర్తి 2021 సంవత్సరంలో తన పేరుమీద అక్రమంగా పట్టా చేయించుకుని రైతుబంధు పొందుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి అమ్మిన పట్టా భూమిని, తిరిగి తనపేరు మీద తప్పుడు పద్ధతిలో మార్పిడి చేసుకున్న దత్తుమూర్తిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

'ఉపాధి' కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ

సాక్షి స్పందన

నెన్నెల: మండలంలోని ఉపాధి కూలీలకు సోమవారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అధికారులు పంపిణీ చేశారు. మార్చి 29న 'తల్లడిల్లుతున్న ఉపాధి కూలీలు' కనీసం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు కూడా అందించడం లేదు, సౌకర్యాలు కల్పించడం లేదనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి డీఆర్‌డీఓ కిషన్ స్పందించారు. జిల్లా కార్యాలయం నుంచి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను మండలానికి పంపించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి కూలీలకు పంపిణీ చేయాలని ఆదేశించడంతో ఉపాధిహామీ సిబ్బంది, ఈజీఎస్ ఏపీఓ నరేష్, పంచాయతీ కార్యదర్శులు సాగర్, పద్మనాభం, సతీశ్‌లు కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేశారు.



గన్‌పూర్‌లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందిస్తూ...

తొట్టిలో నీటిని నింపారు..!

సాక్షి స్పందన

భీమారం: 'తొట్టిలో నీటిని నింపండి' అనే శీర్షికన మార్చి 31న 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ స్పందించారు. ఈ మేరకు సోమవారం గ్రామపంచాయతీ సిబ్బందితో సహా తాను లంబాడీతాండ లోని నీటితొట్టి వద్దకి వెళ్లి సిబ్బందితో దానిని శుభ్రం చేయించారు. అనంతరం బోరుబావి నుంచి పైపు ద్వారా నీటిని తొట్టిలో నింపించారు. పశువులకు నీటిని నిరంతరం అందిస్తామని కార్యదర్శి తెలిపారు.



నీటిని నింపుతున్న గ్రామపంచాయతీ సిబ్బంది

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



తాండూర్: ప్రారంభిస్తున్న అధికారులు



జన్నారంలో ప్రారంభిస్తున్న తహసీల్దార్

తాండూర్/బెల్లంపల్లిరూరల్/కోటపల్లి/నెన్నెల/జన్నారం/వేమనపల్లి: జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ధాన్యం తేమశాతం అధికంగా ఉండకుండా చూసుకుని మద్దతు ధర పొందాలని తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 ధర నిర్ణయించినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాండూర్ మండలంలోని అచలాపూర్‌లో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, వ్యవసాయ విస్తరణ అధికారి ధనలక్ష్మి ప్రారంభించారు. బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దదుబ్బ గ్రామంలో ఐకేపీ ఆకెనపల్లి గ్రామాఖ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో మహేందర్, ఐకేపీ ఏపీఎం శ్యామల ప్రారంభించారు. కోటపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎంపీడీవో భూమన్న ప్రారంభించారు. నెన్నెల మండలంలోని చిత్తాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం విజయలక్ష్మి ప్రారంభించారు. జన్నారం మండలం మొర్రిగూడ గ్రామంలో తిరుమల గ్రామైఖ్య, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీడీవో శశికళ ప్రారంభించారు. వేమనపల్లిలో గ్రామ సమైక్య సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ సీసీ శివరాం ప్రారంభించారు.

పనులు నాణ్యతగా చేపట్టండి

- అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

లక్సెట్టిపేట: పాఠశాల భవన నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు అన్నారు. మండల కేంద్రంలో నాబార్డు నిధులు రూ.ఐదు కోట్లతో నిర్మిస్తున్న ఉన్నత బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను సోమవారం పరిశీలించి మాట్లాడారు. నిర్మాణ పనుల్లో లోపాలు ఉండకుండా నాణ్యతగా ఏర్పాటు చేయాలని, పనులను వేగవంతం చేస్తూ త్వరగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, టాయిలెట్సు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టి పక్కా భవన నిర్మాణాల కోసం కృషి చేస్తుందన్నారు. అనంతరం నిర్మాణ పనులపై సిబ్బందిని అడిగి తెలుసుకుని తిరిగి చూశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరీఫ్, నాగభూషణం, రమేష్ ప్రిన్సిపాల్ శైలజ పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వడ్డనపల్లి గ్రామంలో ఈజీఎస్ కింద రూ.ఎనిమిది లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులతో పాటు మురుగు కాలువ నిర్మాణ పనులను సోమవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పరిశీలించారు. స్థానికుల ద్వారా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల పై నుంచి 11కేవీ విద్యుత్ లైన్ ఉందని, ప్రమాదం తలెత్తే అవకాశం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి త్వరగా సమస్యను నివారించాలని సూచించారు. మురుగు కాలువ ద్వారా నీరు వెళ్లడం లేదని, ఇందుకు నిధులు కేటాయించాలని, స్థానిక పునరావాస కాలనీకి ఆనుకుని సర్వే నంబర్ 61లో 700 గజాల భూమిని కొంతమంది కబ్జా చేశారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా రెవెన్యూ అధికారుల ద్వారా సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని చెప్పారు. మండలంలో ఎక్కడ కూడా మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి రూ.10లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకం అమలు జరుగుతుందన్నారు. చిన్న, సన్నకారు రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట రవి, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజ్, నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, అంకం కృష్ణమూర్తి, రామారావు, బొడ్డు శంకర్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

'అంబలి కేంద్రం ఏర్పాటు అభినందనీయం'

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో కొక్కిరాల రఘుపతిరావు, వనపర్తి భూమయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత అంబలి కేంద్రంతో పాటు, చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యేట వేసవి కాలంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వనపర్తి రవి–మాలిక దంపతులు ఉచిత అంబలి కేంద్రం, చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం అని కొనియాడారు. అనంతరం పలువురికి అంబలిని అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీశ్, మాజీ ఎంపీపీలు శకుంతల, కాంతరావు, పార్టీ సీనియర్ నాయకుడు త్రిమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి నిధులు

పాతమంచిర్యాల: మున్నూరుకాపు సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.10లక్షల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు తెలిపారు. సోమవారం ఆయన నివాసంలో మున్నూరు కాపు సంఘం నాయకులతో కలిసి సమావేశం నిర్వహించి నిధుల వివరాలు ప్రకటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సంఘం సభ్యులు శాలువా, గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, మున్నూరు కాపు ట్రస్ట్ చైర్మన్ నల్ల శంకర్ తదితరులు ఉన్నారు.


అమ్మవార్లకు బోనాలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్‌రూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామంలో మధునపోచమ్మ, మాంతమ్మ, లక్ష్మీదేవరలకు సోమవారం గ్రామస్తులు బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలందరూ మంగళహారతులు, బోనాలతో ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేసి, అనంతరం మొక్కులు సమర్పించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ అంగ లక్ష్మీ, రమేశ్, కాంగ్రెస్ నాయకులు హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



పశువుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి

భీమారం: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కాజిపల్లిలో నిర్వహించిన పశువైద్యశిబిరంలో 150పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేశారు. ఈ మేరకు మండల పశువైద్యాధికారి రాకేశ్‌శర్మ మాట్లాడుతూ.. ప్రతీ రైతు వారికి గల గేదెలతో పాటు ఆవులకు విధిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్, వైద్యసిబ్బంది సంపత్, రమేష్ పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేసి



బస్‌స్టేషన్ ముఖద్వారం ఎదుట నిరుపయోగంగా

- బస్‌స్టేషన్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్ నిరుపయోగం

మంచిర్యాలఅర్బన్: అసలే ఎండలు మండిపోతున్నాయి. నీళ్లు తాగకుండా కొద్దిసేపు ఉండలేని పరిస్థితి. చల్లని నీరు ఇష్టపడని వారెవరు..? ప్రయాణికులకు చల్లని శుద్ధమైన నీరు అందించటానికి మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఎంపీ నిధులతో దాదాపుగా రూ.10లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా చెన్నూర్ ప్లాట్ ఫారమ్ సమీపంలో క్యాంటిన్ దగ్గర బోర్‌కు అమర్చారు. రూపాయి కైన్ వేస్తే బాటిల్‌లో చల్లటి, శుద్ధమైన నీరు నిండేది. చిన్నపాటి మరమ్మతులకు గురి కావటం.. నిర్వహణ లేకపోవటంతో మూలనపడింది. ఇటీవల క్యాంటిన్‌ను అద్దెకు తీసుకున్న వారికి అడ్డుగా ఉందనో ..?ఏమోగానీ ఏకంగా బోర్ కనెక్షన్ తీసేసి బస్‌స్టేషన్ ముఖద్వారం ఎదుట నాలుగు బండలపై అలా ప్లాంట్‌ను పడేశారు. ఆర్వో ప్లాంట్ ఉండాల్సిన చోట వ్యాపారులు స్టాండ్‌పై వాటర్‌బాటిళ్లు పెట్టి విక్రయాలు జరుపుతున్నారు. చల్లని నీరు అందించాలనే సంకల్పంతో ఏర్పాటైన ఆర్వో వాటర్ ప్లాంట్‌పై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నిరుపయోగంగా మారింది.



బండలపైన అలంకారప్రాయంగా...

పోలింగ్‌స్టేషన్‌లను తనిఖీ చేసిన ఏసీపీ

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని మారుమూల ప్రాంతం పెద్దఅరటిపల్లి పోలింగ్‌స్టేషన్‌ను సోమవారం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పరిశీలించారు. తిర్యాణి, కాసిపేట మండలాల సరిహద్దులోని మారుమూల ప్రాంత పోలింగ్‌స్టేషన్‌లను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా గ్రామస్తులందరూ ఐక్యంగా ఉండాలని, ఎటువంటి ఆపద ఉన్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా గ్రామస్తులు సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరారు. ఆయన వెంట మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ రవికుమార్

భైరాన్‌పల్లి సినిమా నిర్మాతకు సన్మానం

మంచిర్యాలక్రైం: భైరాన్‌పల్లి సినిమా నిర్మాత ముద్దం నరేష్ వర్మను స్థానిక సినీ దర్శకుడు, రుద్రనేత్రి సినిమా ఫేమ్ కే.తిరుపతి వర్మ, మంచిర్యాల మూవీ ఆర్టిస్ట్ బృందం సోమవారం స్థానిక ఎస్ఎస్ గ్రాఫిక్స్ స్టూడియోలో ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కోటపెల్లి పోలీస్‌స్టేషన్ సినిమా హీరో మహేశ్, కెమెరామెన్ దుర్గం విజయ్, సాగర్, గుండ శ్రీధర్, మంచిర్యాల మూవీ ఆర్టిస్టుల సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న మంచిర్యాల మూవీ ఆర్టిస్ట్ సభ్యులు